క్లుప్తంగా

రైతులకు అందుబాటులో విత్తనాలు

పాలకొండ: రైతులకు అందుబాటులో కట్టిజనుము విత్తనాలు ఉన్నాయని ఏఓ వై.వాహిని తెలిపారు. విత్తనాలు కావాలనుకునే రైతులంతా తమ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనల మేరకు రైతులు విత్తనాలు చల్లుకోవాలని తెలిపారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి

గుమ్మలక్ష్మీపురం: వేసవి ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు సూచించారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఎండలు కారణంగా రోజువారీ నమోదయ్యే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఈ క్రమంలో బయటకు వెళ్లే వారంతా ఎండ బారి నుంచి తప్పించుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరమైన పనులైతేనే బయటకు వెళ్లాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. వీలైతే తరచూ నిమ్మ రసం, గ్లూకోజ్ నీరు తాగాలన్నారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక పట్టణంలో పలుచోట్ల చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆయన ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకూడదని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, సమాజ ఆరోగ్యానికి సహకరించాలని కోరారు.

పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు



హద్దురాళ్ల ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ: పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని ఉప తహసీల్దారు బి.బుచ్చయ్య సూచించారు. భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని వెలగవాడ, లుంబూరు, కొండాపురం గ్రామాల్లో జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటును శనివారం పరిశీలించిన ఆయన రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరగాలన్నారు. దాదాపు వందేళ్ల తర్వాత జరిగే ఈ సర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు.

లోక్ అదాలత్‌లో 130 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సౌజన్య

కురుపాం: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 130 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి డి.సౌజన్య తెలిపారు. కురుపాం, జియ్యమ్మవలస, నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన పలు క్రిమినల్ కేసులను ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు ఎం.వెంకటరమణ, జి.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

విశాఖపట్నానికి ఓంఎంఎస్ సర్వీసులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం – విశాఖపట్నం రూట్లలో తిరిగే ఓఎంఎస్ సర్వీసుల్లో విజయనగరం బస్సు స్టేషన్‌కు వెళ్లకుండా గొట్లాం నుండి చెల్లూరు బైపాస్ రోడ్డు మీదుగా బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సత్యకనకదుర్గ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బైపాస్ సర్వీస్ ట్రిప్పులకు రిజర్వేషన్ కూడా చేయించుకోవచ్చునన్నారు. పార్వతీపురం నుండి ఉదయం 5.40, 7.15, 8.00గంటలు, మధ్యాహ్నం 1.20, 2.15, 3.15 గంటలకు బస్సు సర్వీసులు ఉంటాయన్నారు. విశాఖపట్నం నుండి ఉదయం 6.20, 7.40, 9.00, మధ్యాహ్నం 1.20, 2.20, 3.15 గంటలకు సర్వీసులు ఉంటాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మలుపు ప్రమాదానికి పిలుపు



గోపాలపురం–మంగళాపురం రోడ్డులోని మలుపు ప్రమాదాలకు నెలవుగా మారింది. రాజాం, విజయనగరం మీదుగా విశాఖపట్నం వెళ్లేందుకు చాలామంది ఇదే దారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సరిగ్గా ఇక్కడి మలుపు వద్దకు రాగానే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో కొంతమంది మృత్యువాత పడగా, మరికొంతమంది తీవ్రగాయాలపాలయ్యారు. అధికారులు చొరవ తీసుకుని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

–పాలకొండ రూరల్

వేసవి ఉపశమనం

వేసవి నేపథ్యంలో భానుడి ప్రతాపానికి మనుష్యులే కాదు మూగజీవాలు కూడా అల్లాడిపోతున్నాయి. శనివారం కాచిన ఎండ తీవ్రతకు తట్టుకోలేని గేదెలు పాలకొండ మండల కేంద్రంలోని కృష్ణప్ప కోనేరులో ఇలా సేదతీరుతూ కనిపించాయి.

–పాలకొండ రూరల్



పనస పసందు

పనస రైతుల పంట పండింది. పనస కాయలు గుత్తులు గుత్తులుగా కాయడంతో పాటు మార్కెట్‌లో పనసకు మంచి డిమాండ్ ఉంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొన్ని ప్రాంతాల్లో వంటకాల్లో కూడా దీనిని విరివిగా వినియోగిస్తుండడంతో లాభాలు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–గుమ్మలక్ష్మీపురం



గిరిజన గురుకులం పిలుస్తోంది



సీతంపేట బాలికల కళాశాల

- ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం
- ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు
- పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 1030 సీట్లు
- నెలాఖరు వరకు దరఖాస్తు గడువు
- వచ్చేనెల 8న కౌన్సెలింగ్

మండలం	సీట్ల ఖాళీలు
సీతంపేట (బాలురు)	170
సీతంపేట (బాలికలు)	140
పెద్దమడి (బాలురు)	120
పి.కునాయివలస (బాలికలు)	140
కురుపాం (బాలికలు)	80
భద్రగిరి (బాలురు)	120
పి.కోనాయివలస (బాలురు)	140
భద్రగిరి (బాలికలు)	120

పార్వతీపురం/సీతంపేట

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రట రీ నోటిఫికేషన్ జారీ చేశారు. గిరిజన గురుకులాల్లో చేరే విద్యార్థులకు ఉచిత భోజన వసతితో పాటు వైద్యసదుపాయాలు వంటివి ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ కళాశాలల్లో సీటు లభించిందంటే కార్పొరేట్ కళాశాలల్లో సీటు లభించినట్టేనని విద్యావేత్తలు చెబుతుంటారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 8 కళాశాలలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు ఒకేషనల్ అక్కౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, సీజీఏ గ్రూపులున్నాయి. వీటిలో 1030 ఖాళీలు ఉన్నాయి. పదోతరగతి పాసై న విద్యార్థులు దాదాపు ఏటా 2 వేల మంది ఈ సీట్లు కోసం పోటీపడుతుంటారు.

మెరిట్ ఆధారంగానే...

పదోతరగతిలో వచ్చే మెరిట్ మార్కులు ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ప్రతీ గ్రూపుకు 40 సీట్లు కేటాయించారు. దీనిలో ఎస్టీ 36 సీట్లు, ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూ ఒక్కో సీటు మొత్తం నాలుగు సీట్లు కేటాయిస్తారు. ఒకేషనల్ ఏఅండ్‌టీ 20, సీజీఏ గ్రూపులో 30 సీట్లు పూర్తిస్థాయిలో ఎస్టీలకు కేటాయించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి...

విద్యార్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూఆర్.గవ్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం	:	11-05-2023
దరఖాస్తు చేసుకోవడానికి చివరితేది	:	31-05-2023
మెరిట్ జాబితాప్రకటన	:	05-06-2023
కౌన్సెలింగ్ తేదీ	:	08-06-2022

మూడో తరగతి ప్రవేశానికి..

ఐటీడీఏ పరిధిలోని పీటీజీ బాలికల భద్రగిరి పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి మూడో తరగతి ప్రవేశానికి (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 లోగా దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకోసం భద్రగిరి ప్రిన్సిపాల్ 9346287567 నంబర్‌ను సంప్రదించాలన్నారు. పాచిపెంటలోని మినీ గురుకులంలో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పీఓ తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఈనెల 31లోగా గిరిజన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌ఎం 94414 63451 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి



గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలి. పూర్తిస్థాయిలో మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించడం జరుగుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు విద్యార్థులకు దగ్గర్లో ఉన్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలను సంప్రదించాలి.

– విశ్వనాథం, కన్వీనర్, ప్రిన్సిపాల్, బాలుర జూనియర్ కళాశాల

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు సచివాలయం నూతన భవనాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు తీసుకువచ్చేందుకే సచివాలయ వ్యవస్థను ఆయన తీసుకువచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, ఎంపీపీ శెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రోగుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్

వీరఘట్టం: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బీసీ కాలనీలో దాదాపు 150 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వేసవి ఎండలు విపరీతంగా ఉంటున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పనికి వెళ్లే వారు కూడా పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



సైన్స్ అంశాలను విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు రవి మహాపాత్రో

భామిని: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ ఎ.సునీత సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శరీర అవయవాల పని తీరును సైన్స్ టీచర్ రవి మహాపాత్రో శనివారం వివరించారు. మన శరీరంలోని ప్రతీ అవయవం అవసరమేనని, వాటి ఆరోగ్యానికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో లభ్యమయ్యే అనేక రకాల పుస్తకాలు చదివి, విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. బాగా చదువుకుని, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

కురుపాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమై, తద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ప్రకృతి వ్యవసాయం డివిజనల్ యాంకర్ పర్సన్ జి. అన్నపూర్ణ తెలిపారు. శనివారం మండలంలోని రస్తాకుంటుబాయి, పాడి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన విత్తనాలను పరిశీలించిన ఆమె తొలకరి జల్లులు (వర్షం)కు ముందుగా నవధాన్యాలు సాగు చేసుకుంటే నేల కు మంచిదన్నారు. నేల బాగుంటేనే పంటలు బాగా పండుతాయన్నారు. అనంతరం రైతుల కు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ ఎ.మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి. తిరుపతిరావు, ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భామిని: మండలంలోని గురండి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్ దగ్గర జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, బాధిత ప్రాంతాల ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

మా మంచి మాస్టారు..!

- ఆదర్శంగా నిలుస్తున్న చిట్టపులివలస ఉపాధ్యాయుడు
- సెలవుల్లోనూ వియ్ లవ్ రీడింగ్ పేరిట ప్రత్యేక తరగతులు
- గణితం, ఇంగ్లిష్ అంశాలపై అవగాహన కల్పిస్తూ బోధన
- చుట్టుపక్కల గ్రామాల నుంచి 200 మంది హాజరు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఉపాధ్యాయుడు రాంబాబు



చిట్టపులివలస పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న రాంబాబు మాస్టారు

వీరఘట్టం: ఆయన పేరు రాంబాబు.. చిట్టపులివలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈయన రోజులో సగం సమయం బడిలోనే ఉంటారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. ఇలా ఒక్కరోజు కాదు.. రెండు రోజులు కాదు.. ఏడాదిలోని 365 రోజులూ విద్యార్థులకు అందుబాటులో ఉండి, వారి విద్యాప్రగతికి బాటలు వేస్తున్నారు. పాఠశాలకు పండగ సెలవులిచ్చినా, వేసవి సెలవులిచ్చినా ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఉండి, విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేస్తున్నారు. ఏ ఊరిలో పనిచేసినా ఆయనది ఇదేతీరు కావడంతో మెచ్చుకోని విద్యార్థులు, గ్రామస్తులు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినా ఆయన ఎక్కడికీ వెళ్ల లేదు. ఇక్కడే ఉండి వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయన వద్దకు వచ్చే విద్యార్థులతో పుస్తకాలు, కథలు చదివించడంతో పాటు వారిలోని సృజనాత్మక శక్తులను పదును పెట్టేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రధానంగా చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాసామర్థ్యాలను మెరుగుపరుస్తున్నారు. ఇంగ్లిష్, గణితం అంశాలపై విద్యార్థులకు పట్టు వచ్చేలా చేస్తున్నారు. కంబర, విక్రమపురం, నడిమికెల్ల, కోదులగుమ్మడ, వీరఘట్టం నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు ఈయన తరగతులకు హాజరవుతున్నారు. ఆయన సేవాభావం, ఆయనకు వృత్తి పట్ల ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధతను అందరూ మెచ్చుకుంటున్నారు. ఇటీవల ఇదే పాఠశాలను సందర్శించిన పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఆయనను అభినందించడం విశేషం.

మట్టిబొమ్మల తయారీపై శిక్షణ



మట్టిబొమ్మల తయారీపై శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ మాస్టర్ మురళి

పాలకొండ రూరల్: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మట్టి బొమ్మల తయారీపై శనివారం శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్ మాస్టర్ మురళి చిన్నారులతో వివిధ మట్టి కళాకృతులు తయారు చేయించి, వాటి తయారీలో మెలకువలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు తెలుగు పద్యాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పార్వతీపురమే లక్ష్యం



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న జట్టు సభ్యులు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ రహిత పార్వతీపురమే లక్ష్యం కావాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ బోగి ఈశ్వరరావు అన్నారు. జట్టు ఆశ్రమం నిర్వాహకులు పద్మజ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో చెత్త శుద్ధి కార్యక్రమం శనివారం ప్రారంభించారు. అందులో భాగంగా పార్వతీపురం పురపాలక సంఘం కార్యాలయం నుంచి పార్వతీపురం మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న పలు వీధుల్లో ప్రదర్శన చేస్తూ జట్టు ఆశ్రమ వరకు ప్లాస్టిక్ వల్ల వచ్చే నష్టాలను వివరించారు. భోగి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత పార్వతీపురం కోసం జరిగే కార్యక్రమాలలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు.

జిల్లా కేంద్రంలో నో యాక్సిడెంట్ డే

పార్వతీపురం టౌన్: ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఆటోలు నడిపేటప్పుడు పరిమితికి మంచి లోడ్ ఉంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్‌ఐ రాజారావు, కిషోర్, సంవత్, ఆటో డ్రైవర్‌లు, వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.